క్లుప్తంగా

19న ఏఎస్ఎన్ఎం కళాశాలలో జాతీయ సెమినార్

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 19న డిపార్ట్‌మెంట్ ఆఫ్ జువాలజీ, ఆక్వా కల్చర్, ఐక్యూఏసీ విభాగంతో అనుసంధానం చేసుకుని జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నట్లు గురువారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి తెలిపారు. ఈ సెమినార్ తాజా పురోగతులు కీలక సవాళ్లు మరియు స్థిరమైన ఆక్వా కల్చర్ పద్ధతుల ప్రాముఖ్యత అనే అంశంపై జరుగుతుందన్నారు. ఆక్వా కల్చర్ పరిశ్రమలో కీలక సవాళ్లను గుర్తించడానికి, ఆచరణాత్మక పరిష్కారాలను అన్వేషించడానికి ఆక్వా కల్చర్ స్థిరమైన పద్ధతుల ప్రాముఖ్యతను తెలుసుకోవడానికి, పర్యావరణ పరిరక్షణకు ఆర్థిక, పెట్టుబడి అవకాశాల్ని అన్వేషించడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఈ సమావేశానికి సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు.

రాష్ట్ర బాస్కెట్ బాల్ జట్టుకు ఎస్‌వీకేపీ విద్యార్థులు


రాష్ట్ర జట్టుకు ఎంపికైన పెనుగొండ విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సూర్యనారాయణ

పెనుగొండ: రాష్ట్ర బాస్కెట్ బాల్ జట్టుకు పెనుగొండ ఎస్‌వీకేపీ అండ్ పితాని వెంకన్న జూనియర్ కళాశాల విద్యార్థులు అంతర్ జిల్లాల బాస్కెట్ బాల్ పోటీలలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ కొల్లి వెంకట రామ సూర్యనారాయణ తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ చిత్తూరు జిల్లా మదన పల్లిలో గత నెలలో జరిగిన 67వ అండర్ 19 అంతర్ జిల్లాల బాస్కెట్ బాల్ పోటీలకు కళాశాల నుంచి ఓలేటి సతీష్, చుక్కా ధోనీ శ్రీవర్ధన్, నక్కా ప్రవీణ్ కుమార్, వాసంశెట్టి విజయకుమార్, అప్పారి మోహన కల్యాణ్‌రామ్ శెట్టి పాల్గొని తృతీయ స్థానం సాధించినట్లు వివరించారు. వీరిలో ఓలేటి సతీష్, చుక్కా ధోనీ, శ్రీవర్ధన్‌లు రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారని వివరించారు. జనవరిలో పంజాబ్ పాటియాలలో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు పితాని సూర్యనారాయణ, సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ కలిదిండి రామచంద్రరాజు, కోశాధికారి ఉద్దగిరి లవకుమార్, పాలకవర్గ సభ్యు లు, పీడీ బి.దుర్గారావులు అభినందించారు.

పశువులకు గొంతువాపు వ్యాధి నివారణ టీకాలు

యలమంచిలి: మిచాంగ్ తుఫాన్ నేపథ్యంలో వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు రావడంతో పశువులకు గొంతు వాపు వ్యాధి సోకే ప్రమాదం ఉందని మండల పశు వైద్యాధికారి డాక్టర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పశువులకు గొంతు వాపు వ్యాధి నివారణ టీకాలు వేయడానికి ఆదేశాలిచ్చినట్లు ఆయన వివరించారు. తుపాను వల్ల గోదావరి పరివాహక గ్రామాలు, కాల్వ పక్కనున్న గ్రామాల్లోని పశువులకు ఈ వ్యాధి వచ్చే అవకాశం ఎక్కువగా ఉన్నందున ఆ గ్రామాల్లోని పశువులకు తొలి ప్రాధాన్యం ఇచ్చి ఈ వ్యాక్సిన్ వేస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ విధంగా గత నాలుగు రోజుల్లో 843 పశువులకు ఈ వ్యాక్సిన్‌వేసినట్లు ఆయన చెప్పారు. ఆయన వెంట మేడపాడు సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్ బళ్ల దుర్గా భవానీ ఉన్నారు.

రత్నమాలకు ప్రైడ్ ఆఫ్ భారత్ అవార్డు

పెనుగొండ: ఆజాదీకా అమృత మహోత్సవ్‌లో భాగంగా న్యూఢిల్లీకి చెందిన ఆదిలీలా ఫౌండేషన్ భీమలాపురం గ్రామానికి చెందిన శ్రీదేవి ఆర్యవైశ్య మహిళా సేవా మండలి అధ్యక్షురాలు కొత్త కనకరత్నమాలకు ప్రైడ్ ఆఫ్ భారత్ అవార్డు ప్రదానం చేసింది. గురువారం విలేకరులతో భీమలాపురంలో కొత్త కనక రత్నమాల మాట్లాడుతూ రాజమండ్రిలోని జిత్‌మోహన్ మిత్ర కళాప్రాంగాణంలో జరిగిన సమావేశంలో జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ ఆదినారాయణ, ఏపీ కన్వీనర్ కె.చంద్రప్రకాష్, ఘంటసాల అవధాన సామ్రాట్ డాక్టర్ రహమతుల్లా, సినీ గాయకులు జిత్‌మోహన్ మిత్ర చేతులమీదుగా అవార్డును అందుకున్నట్లు తెలిపారు.

హెల్మెట్‌ధారణపై అవగాహన

పాలకొల్లు అర్బన్: ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పాలకొల్లు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె సతీష్ చెప్పారు. యలమంచిలి మండలం చించినాడలో వాహనాలు తనిఖీ చేశారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ముఖ్యంగా గంజాయి, గుట్కా తదితర అలవాట్లు మానుకోవాలని చెప్పారు. యువతకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఆయనతో పాటు ఎస్సై కె శివన్నారాయణతో పాటు ఇతర పోలీసులు ఉన్నారు.

నేడు గోదావరి హారతి

నరసాపురం: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం నరసాపురం పంటిరేవు అమరేశ్వరస్వామి ఆలయం వద్ద గోదావరిమాతకు హారతి ఇచ్చే కార్యక్రమాన్ని విశ్వహిందూపరిషత్ చేపట్టింది. రాత్రి 8 గంటలకు గోదావరికి హారతి, శనివారం ఉదయం స్వామీజీల ప్రవచనాలు ఉంటాయని విశ్వహిందూ పరిషత్ నాయకులు గురువారం విలేకరులకు తెలిపారు.అనేక మంది స్వామీజీలు, పీఠాధిపతులు ఈ కార్యక్రమానికి విచ్చేస్తున్నారని గోదావరి పుట్టిన నాశిక్ నుంచి పాదయాత్రగా స్వామీజీలు వస్తున్నారని వివరించారు.

అటు రక్షణ చర్యలు.. ఇటు నష్టాల అంచనా

- మిచాంగ్ విలయం నుంచి తేరుకుంటున్న ప్రజలు
- పంట నష్ట అంచనాల్లో అధికారులు బిజీ
- ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకుంటున్న రైతులు


పెనుగొండ: ఆచంటలో అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ ఎంఏ అంబరీష్


పెనుగొండ: ధాన్యం రాశిని పరిశీలిస్తున్న అధికారులు


పెనుగొండ: ఉధృతంగా ప్రవహిస్తున్న చిలకోడు

పెనుగొండ: మిచాంగ్ తుపాన్‌తో అతలాకుతమైన రైతాంగాన్ని ఆదుకోవడానికి అధికారులు రక్షణ చర్యలు చేపట్టడంతో పాటు, నష్టపోయిన పంట వివరాలు సేకరించడంలో నిమగ్నమయ్యారు. గురువారం నియోజకవర్గంలోని ఆచంట, పెనుగొండ, పెనుమంట్ర, పోడూరు మండలాల్లో అధికారులు విస్తృత పర్యటనలు చేశారు. గ్రామాల్లో తిరుగుతూ రైతులకు భరోసా కల్పిస్తూ రాశులపై ఉన్న ధాన్యాన్ని ఆఫ్‌లైన్‌లో మిల్లులకు తరలించడానికి ఏర్పాటు చేస్తున్నారు. గురువారం నరసాపురం ఆర్డీఓ ఎంఏఅంబరీష్, తహసీల్దార్లు, వ్యవసాయాధికారులు గ్రామాల్లో పర్యటించి రైతులకు రక్షణ చర్యలు సూచించడంతో పాటు, క్షేత్రస్థాయి అధికారులను అప్రమత్తం చేశారు. గ్రామ గ్రామాన రైతు భరోసా కేంద్రాలు, వ్యవసాయ సిబ్బంది ఉండడంతో నష్ట వివరాలు సేకరించడం సులభంగా మారింది. గురువారం సాయంత్రం వరకూ సేకరించిన వివరాలు ప్రకారం పెనుగొండ మండలంలో 11670 ఎకరాలు సాగు చేయగా 5354 ఎకరాల్లోనూ, ఆచంట మండలంలో 10470 ఎకరాల్లో సాగు చేయగా 4175 ఎకరాల్లోనూ, పెనుమంట్ర మండలంలో 12117 ఎకరాలకు గాను 4560 ఎకరాలు, పోడూరుమ ండలంలో 13వేల ఎకరాలకు గాను 3500 ఎకరాల్లో నేలనంటాయి. దీంతో పాటు ఆచట మండలంలో 2100 ఎకరాలు, పెనుమంట్ర మండలంలో 1800 ఎకరాలు నీట మునిగాయి. మిచాంగ్ తుపాన్ ప్రారంభం నాటికే నియోజకవర్గంలో 30 శాతం వరకూ కోతలు పూర్తయ్యాయి. దీంతో వీరిలో కొందరు రైతులు అమ్మకాలు పూర్తి చేసారు. అమ్మకం చేయని రైతన్నలను అధికారులు అప్రమత్తం చేయడంతో 3 వేల మెట్రిక్ టన్నులకుపైగా ఆఫ్‌లైన్‌లో రైసుమిల్లులకు చేర్చుకొన్నారు.

ఉధృతంగా చిలకోడు

పెనుగొండ, ఆచంట మండలాల్లో నక్కల డ్రెయిన్ నిండుగా ప్రవహిస్తుండడంతో మురుగు డ్రెయిన్‌లు పొంగు పొర్లుతున్నాయి. ముఖ్యంగా తాడేరు డ్రెయిన్‌తో పాటు, పెనుగొండలో చిలకోడు ఉధృతంగా ప్రవహిస్తుంది, మాజీమంత్రి శ్రీరంగనాథరాజు ఆదేశాలతో తాడేరు గుర్రపు డెక్క తొలగింపు పనులు శ్రీకారం చుట్టారు. అయితే, చిలకోడు మాత్రం ప్రమాదకరంగా ఉండడంతో గట్లపై నుంచి వరిచేల్లోకి ప్రవహిస్తూ రైతులను ఇబ్బంది పాలు చేస్తుంది. శుక్రవారం నాటికి అదుపులోకి రావచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు.

డ్రెయిన్ల ప్రక్షాళన

మిచాంగ్ తుపాన్ తీవ్రతతో పెనుగొండ, ఆచంట మండలాల్లోని పలు గ్రామాల్లో వరిచేలల్లో వర్షపు నీరు నిలిచి పోవడంతో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరకువాడ శ్రీరంగనాథరాజు ఆదేశాలతో పంటకాలువల్లోనూ, మురుగు డ్రయిన్ల లోనూ నీరు పారుదల సులభంగా ఉండేందుకు ప్రక్షాళన పనులకు శ్రీకారం చుట్టారు. గురువారం ఉదయంనుంచి ముఖ్యంగా తాడేరు కాలువ ప్రక్షాళనను కొన్ని ప్రాంతాల్లో జేసీబీలతోనూ, బ్రిడ్జిల వద్ద కూలీలతోనూ తొలగింపు పనులు ప్రారంభించారు. దీంతో వందలాది ఎకరాలు ముంపు భారీ నుంచి బయటపడుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. పెనుగొండ, ఆచంట మండలంల్లో 7వేల ఎకరాలకు పైగా తుపాన్‌కు నేల నంటాయి, దీంతో పాటు వందలాది ఎకరాలు ముంపులో ఉన్నాయి, వేగంగా నీరు తొలగడం వల్ల పంటను రక్షించుకోవచ్చునని సత్వరం అధికారులు స్పందించి ఏర్పాట్లు చేయా లని మాజీ మంత్రి ఆదేశించడంతో అధికారులు పనులు ప్రారంభించారు. తూడు, గుర్రపు డెక్క తొలగింపు పనులను ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, ఎంపీటీసీ సభ్యురాలు తప్పెట్ల విజయ కుమారి వెంకట్రావు, ఆచంట, కొడమంచిలి గ్రామాల వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షులు పెచ్చెట్టి సత్యనారాయణ, తహసీల్దారు సుబ్రహ్మణ్యం, వ్యవసాయాధికారి నాగరాజు పర్యవేక్షించారు.

వరికి అపార నష్టం


పాలకొల్లు అర్బన్: తిల్లపూడిలో నీటిలో నానుతున్న వరి

పాలకొల్లు అర్బన్: తుపానుకారణంగా కురిసిన భారీ వర్షాలకు సార్వా పంటకు అపార నష్టం వాటిల్లింది. పది రోజుల్లో చేతికందివస్తుందనుకున్న సమయంలో పంట నేలమట్టమైంది. నీటిలో నానుతున్న పంటను కోయడానికి ఎకరానికి రూ.20 వేలకు పైగానే ఖర్చు అవుతుందని తిల్లపూడి గ్రామానికి చెందిన రైతు కూనప రెడ్డి నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. పాలకొల్లు మండలంలో 9,500 ఎకరాల్లో వరి సాగు చేశారు. వర్షాలకు ముందు 1500 ఎకరాల్లో పంట నూర్పిళ్లు పూర్తి చేశారు. దీంట్లో 80 శాతం పైగా ధాన్యాన్ని మిల్లులకు రవాణా చేశారు. మిగిలిన ధాన్యం రాశులపై ఉంది. తుపాను కారణంగా కురిసిన అధిక వర్షాల ప్రభావంతో మండలంలోని 350 ఎకరాల్లో పంట పూర్తిగా నష్టం వాటిల్లిందని వ్యవసాయాధికారి ఎం.శామ్యూల్ జాన్సన్ తెలిపారు.

నరసాపురంలో..

నరసాపురం: మిచాంగ్ తుపాను కారణంగా నాలుగు రోజులు పాటు వర్షాలతో పట్టణమంతా అస్తవ్యస్తంగా తయారయ్యింది. పల్లపు ప్రాంతాలు నీట మునగడంతో వీధులు అధ్వానంగా మారాయి. గురువారం వర్షం పూర్తిగా తగ్గడంతో మున్సిపల్ అధికారులు పరిస్థితిని యథాతథస్థితికి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇంకా ఎన్టీఆర్ కాలనీ, గడ్డిబజార్, వీవర్స్ కాలనీ ప్రాంతాల్లో రోడ్ల మీద నీరు నిల్వ ఉండిపోయింది. నిల్వ ఉన్న నీటిని మున్సిపల్ సిబ్బంది తొలగించే ప్రయత్నం చేస్తున్నారు. అలాగే వార్డుల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టినట్టు మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు చెప్పారు. అంటు వ్యాధులు ప్రబలకుండా మూడు రోజులు పాటు ప్రత్యేక పారిశుద్య పనులు సాగుతాయని చెప్పారు. పరిస్థితిని యథాస్థితికి తీసుకురావడానికి అన్ని చర్యలు తీసుకున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ చెప్పారు. ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే తమకు తెలియజేయాలని సూచించారు.

నిండాముంచిన మిచాంగ్ తుపాను

మొగల్తూరు: మరో పది రోజుల్లో పంట చేతికొస్తుందని ఆనందంలో ఉన్న వరి రైతులను మిచాంగ్ తుపాను నిండా ముంచింది. మండలంలోని 17 గ్రామాల్లో తుపాను దెబ్బ కనిపించింది. మండలంలో సుమారు 1298 ఎకరాల్లో సార్వా సాగు చేపట్టగా దాదాపు వరిచేలన్నీ ముంపునకు గురికావడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. చేలల్లో చేరిన నీరు బయటకు పోయే మార్గం లేకపోవడంతో ధాన్యపు గింజ కుళ్ళిపోతుందని రైతులు వాపోతున్నారు. మరోవైపు దర్బరేవు ప్రవహించే రామన్న పాలెం గ్రామం సమీపంలోని గేదెలవంపు గుట్ట వద్ద డ్రెయిన్ పొంగడంతో పాటు వర్షపు నీరు కూడా చేరడంతో సమీపంలోని పొలాలు ముంపునకు గురయ్యాయి.దీంతో తహసీల్దార్ జి.అనితాకుమారి, ఏఓ రహీమ్‌లు గురువారం జేసీబీతో నీరు పారేలా డ్రెయిన్ తవ్వించడంతో పాటు చెత్తాచెదారాలను తొలగించేందుకు కృషి చేస్తున్నారు.


పెనుగొండ: ఆచంటలో గుర్రపు డెక్క తొలగిస్తున్న దృశ్యం


నరసాపురం: గడ్డిబజార్ వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు


మొగల్తూరు: నక్కావారిపాలెంలో నీటమునిగిన చేను


మొగల్తూరు: రామన్నపాలెం పంచాయతీ గేదెలవంపు గుట్ట వద్ద జేసీబీతో నీటిని బయటకు తోడిస్తున్న అధికారులు

రైతులకు అండగా ప్రభుత్వం


మట్లపాలెంలో నీట మునిగిన వరి పంటను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

యలమంచిలి: రైతులకు అండగా ప్రభుత్వం ఉంటుందని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) భరోసా ఇచ్చారు. మిచాంగ్ తుపాను వల్ల నీట మునిగిన, తలలు వాల్చిన వరి చేలను గురువారం మట్లపాలెం, నారినమెరక, లక్ష్మీపాలెం గ్రామాలలో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ తడచిన, మొలకెత్తిన ధాన్యం కొనడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఆఫ్‌లైన్‌లో ఏ మిల్లుకైనా రైతులు ధాన్యం తోలవచ్చు నన్నారు. తేమ శాతం 21 ఉన్నా 17గా పరిగణించి డబ్బులు చెల్లిస్తారన్నారు. రైస్‌మిల్లు వద్ద ఎవ్వరికీ రూపాయి కూడా లంచం ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. ఎవరైన డబ్బులు డిమాండ్‌చేస్తే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. అలాంటి మిల్లులను వెంటనే బ్లాక్ లిస్టులో పెడతామన్నారు. మునిగిన చేలల్లో నీరు త్వరగా బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఆయన రైతులకు సూచించారు. ఇంజిన్ మోటార్స్‌తో నీరు బయటకు తోడాల్సి వస్తే డీజిల్ ప్రభుత్వం భరిస్తుందన్నారు. రైతులు సంబంధిత వీఆర్వోను కలిస్తే డీజిల్ మంజూరు చేస్తారన్నారు. మురుగుబోదెలు త్వరగా నీరు లాగేలా ఉపాధిహామీ కూలీలతో మురుగు డ్రెయిన్స్ బాగు చేయిస్తున్నట్లు ఆయన వివరించారు. ఇకపై వరదలు, అధిక వర్షాలు వచ్చిన పంట దెబ్బతినకుండా నియోజకవర్గంలోని మురుగు డ్రెయిన్స్ అన్నింటినీ వేసవిలో బాగు చేయిస్తానని ఆయన రైతులు హామీ నిచ్చారు. ఆయన వెంట దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకులు యడ్ల తాతాజీ, నారినమెరక ఎంపీటీసీ ఇసుకపల్లి శ్రీధర్‌వర్మ, లక్ష్మీపాలెం సర్పంచ్ గటిగంటి మహేష్, నాయకులు వలవల బాలాజీ, వలవల సత్య ధర్మారావు, ఆరుమిల్లి లక్ష్మణరావు, కడలి నరసింహస్వామి తహసీల్దార్ మాతా సునీల్‌కుమార్, వ్యవసాయ సహాయ సంచాలకులు ఈద అనిలకుమారి, మండల వ్యవసాయాధికారి చిందులూరి దేవి తదితరులు ఉన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం


తూర్పుపాలెంలో ఆడుదాం ఆంధ్రా కిట్లను అందిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: రాష్ట్రంలో క్రీడాకారులను ప్రోత్సహించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రాకు శ్రీకారం చుట్టారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు తెలిపారు. గురువారం తూర్పుపాలెంలో ఆడుదాం ఆంధ్రా కిట్లను అందజేశారు. సచివాలయం, పంచాయతీ, మండల స్థాయి, జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించి ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికి తీసి ప్రోత్సహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పెనుమంట్ర ఎంపీపీ కేవీఎస్ నారాయణ రెడ్డి(వాసు), దేవ సర్పంచ్ నల్లూరి సత్యనారాయణ, మాముడూరు సర్పంచ్ దేవేంద్రుడు, ఉప సర్పంచ్ సాకా సుబ్రహ్మణ్యం, విద్య మౌలిక వసతుల కల్పన కార్పొరేషన్ డైరక్టరు కొవ్వూరి వేణుమాధవ రెడ్డి, కీర్తి తాతాజీ, పెనుమంట్ర సచివాలయ మండల కన్వీనరు కొవ్వూరి చిన్న, ఏఎంసీ డైరక్టరు కుసుమే రాంబాబు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలి

నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. తూర్పుపాలెంలో నాయకులతో సమీక్ష నిర్వహించారు. గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో చేపట్టిన మురుగు డ్రయిన్లు, సీసీ రోడ్ల నిర్మాణాలు సత్వరం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల బూత్ కన్వీనరు కొమ్మిరెడ్డి హిమదత్, బీసీ సెల్ మండల కన్వీనరు కాసాని శ్రీను, పెన్మెత్స విశ్వనాథరాజు, బండారు దుర్గా ప్రసాద్, చిటికెన బాబీ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


జెడ్పీటీసీ చాంబర్‌ను ప్రారంభిస్తున్న చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా జగన్ సర్కారు పని చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. నరసాపురం మండల పరిషత్ కార్యాలయంలో రెండవ అంతస్తులో జిల్లా పరిషత్ నిధులు రూ.21లక్షలతో నూతనంగా నిర్మించిన జెడ్పీటీసీ చాంబర్‌ను ఆయన జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణ, ఎంపీపీ మైలాబత్తుల సోనిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అందిస్తున్న ప్రజా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు ఈ స్థాయిలో ఎన్నడూ జరగలేదన్నారు. గత నాలుగున్నరేళ్ల కాలంలో ప్రజారంజకంగా పాలన అందించి ఇతర రాష్ట్రాలకు సీఎం జగన్ ఆదర్శంగా నిలుస్తున్నారని ఆయన అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన అనంతరమే మన రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. రాబోయే కాలంలో మన రాష్ట్రం అభివృద్ధి పథంలో కొనసాగాలంటే మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఉంగరాల రమేష్‌నాయుడు, మైలాబత్తుల శ్రీను, వ్యవసాయ సలహా మండలి అధ్యాక్షులు నరసింహులు, చినమిల్లి చందు, సర్పంచ్ తిరుమాని వెంకట్రాజు, ఎంపీడీఓ వీకే వీర భద్రరావు, ఏఈ నాగేశ్వరరావు, ఆకన యేసుబాబు పాల్గొన్నారు.

తుపాను బాధితులకు అండ


తుపాను బాధితులకు దుస్తులు పంపిణీ చేస్తున్న జీవరత్నం

మొగల్తూరు: తుపాను బాధితులకు అన్ని విధాల అండగా ఉంటామని ది హెల్పింగ్ హార్ట్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు కారుమంచి జీవరత్నం తెలిపారు. గురువారం పేరుపాలెం, కేపీ పాలెం గ్రామాల్లోని పునరావాస కేంద్రాల్లోని తుపాను బాధితులకు దుప్పట్లు, చీరలు ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టామని త్వరలో వృద్ధాశ్రమాన్ని ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. సంస్థ సభ్యులు కొప్పినేని రాధాకృష్ణ, తిరుమల విశాఖ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


యలమంచిలి: కలగంపూడిలో ఆయుష్మాన్ భారత్ కార్డులు అందజేస్తున్న ఎంపీపీ రావూరి వెంకటరమణ బుజ్జి


పాలకొల్లు అర్బన్: తిల్లపూడిలో ప్రగతి నివేదికను ఆవిష్కరిస్తున్న నాయకులు

యలమంచిలి: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా చేసుకుని పాలన సాగిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీపీ రావూరి వెంకటరమణ బుజ్జి అన్నారు. కలగంపూడి గ్రామంలోని సచివాలయం వద్ద గురువారం జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జగనన్న పాలనలో రాష్ట్రంలో ఉన్న ప్రతి కుటుంబానికి న్యాయం జరిగిందన్నారు. ముందుగా కలగంపూడి గ్రామంలో ఈ నాలుగున్నరేళ్లలో ప్రత్యక్ష నగదు బదిలీలో 25 పథకాల ద్వారా రూ.6.59 కోట్లు, పరోక్ష నగదు బదిలీలో మరొక 8 పథకాల ద్వారా రూ.2.73 కోట్లు, గ్రామాభివృద్ధికి రూ.4.27 కోట్లు వెరసి మొత్తం రూ13.59 కోట్లు ఖర్చు చేసినట్లు వివరిస్తూ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన బోర్డులను నాయకులు ప్రారంభించారు. చివరగా కలగంపూడి సెంటర్లో ఉన్న దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ జెండాను పార్టీ మండల కన్వీనర్ పొత్తూరి బుచ్చిరాజు ఎగురవేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పొత్తూరి విష్ణుప్రియ, పార్టీ గ్రామ కమిటి అధ్యక్షుడు బండి శ్రీనివాస్ ఎంపీటీసీ సభ్యురాలు వినుకొండ ధనలక్ష్మీ రవికుమార్ నాయకులు తోటకూర సత్యనారాయణరాజు, పొత్తూరి సత్యనారాయణరాజు, ముదునూరి నరసింహరాజు, ఉచ్చుల స్టాలిన్, వల్లభు నరసింహారావు, కవురు గోపి, గటిగంటి మహేష్, పాలంకి శ్రీనివాసరావు, గుర్రాల వెంకట్రావు, డేగల సూర్యప్రభ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

తిల్లపూడిలో..

పాలకొల్లు అర్బన్: ప్రజల సంక్షేమం కోసం నిరంతరం ఆలోచన చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విప్పర్తి ప్రభాకరరావు చెప్పారు. పాలకొల్లు మండలం తిల్లపూడిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వలంటీర్, గ్రామ సచివాలయ వ్యవస్థల ద్వారా మెరుగైన పాలన అందిస్తున్న సీఎం జగన్ రానున్న ఎన్నికల్లో మరలా సీఎంగా ఎన్నుకోవాలని కోరారు. తిల్లపూడి గ్రామంలో ప్రత్యక్షంగా రూ.15,27,15,838, పరోక్షంగా రూ.2,97, 99,840, అభివృద్ధి పనుల నిమిత్తం రూ.1,84,75,000, మొత్తంగా రూ.20,09, 90,678 లబ్ధి చేకూరినట్లు ఆయన వివరించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను సూచించే ఫ్లెక్సీని ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి కె మాణిక్య వైభవతి, ఉపసర్పంచ్ పాలా సూర్యప్రకాష్, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేటి సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి సతీష్, మండల సచివాలయ కన్వీనర్ పార్శి వెంకటరత్నం, సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు గుమ్మాపు పెద్దిరాజు, గ్రామ కమిటీ అధ్యక్షుడు నడపన కృష్ణమూర్తి (సీఎం), గ్రామ కమిటీ నాయకులు శిరిగినీడి అబ్బు, ర్యాలి కాశి, కె నాగేశ్వరరావు, మేడిది శ్రీను పాల్గొన్నారు.